క్లుప్తంగా

రాయితీలతో సెప్టిక్ ట్యాంకులు మంజూరు



సెప్టిక్ ట్యాంక్ వాహనాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

చీమకుర్తి: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేషనల్ సఫాయి కర్మచారి పథకం ద్వారా చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలో ఐదుగురు పేదలకు ఒక్కొక్కరికి ఒకటి చొప్పున 5 సెప్టిక్ ట్యాంకులు మంజూరైనట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి తెలిపారు. వాటిని చీమకుర్తి మున్సిపాలిటీలో బుధవారం ప్రారంభించారు. బొంతా వెంకటేశ్వర్లు, పాటిబండ్ల ఆదాము, గర్నిపూడి రవితేజ, బత్తుల వెంకటేశ్వర్లు, మట్టిగుంట రామాంజనేయులకు వాటిని మంజూరు చేశారు. ఒక్కొక్క వాహనం ఖరీదు రూ.31.67 లక్షలు కాగా, రూ.15.06 లక్షలు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. చీమకుర్తి పట్టణంలో మంజూరైన మరగుదొడ్లను శుభ్రం చేసేందుకు వాటిని వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. సెప్టిక్ ట్యాంక్ వాహనాల ప్రారంభోత్సవంలో చైర్‌పర్సన్‌తో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ చల్లా అంకులు, వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆశ్రమాలకు నిత్యావసరాల అందజేత

ఒంగోలు: స్థానిక బొమ్మరిల్లు హోమ్, ఆర్గనైజేషన్ హోమ్, లూయిస్ అంధ విద్యార్థుల పాఠశాల, సమతా మహిళా వేదిక, విశ్వసేవిక ట్రస్టు, మాతృవాత్సల్య వృద్ధుల ఆశ్రమానికి స్థానిక సాయిబాబా సెంట్రల్ స్కూల్ విద్యార్థులు బుధవారం నిత్యావసరాలు అందజేశారు. బియ్యం, పప్పుధాన్యాలు, ఇడ్లీ రవ్వ, చింతపండు, గోధుమపిండి, వంటనూనె, కొబ్బరినూనె, సబ్బులు, పేస్టులు, బ్రష్‌లు, దుప్పట్లు, బిస్కెట్లు, పండ్లు, వస్త్రాలను సాయిబాబా సెంట్రల్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు, ఇతర విద్యార్థులు అందించారు. చిన్నారులను ప్రోత్సహించిన తల్లిదండ్రులను పాఠశాల అకడమిక్ డైరెక్టర్ శృతి సాయినాథుని, కరస్పాండెంట్ జీవీ భాస్కర్ కొనియాడారు.

ఘనంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం



కోలాట నృత్యంలో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో బాబా విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. షిరిడీ సాయి కల్చరల్ మిషన్ సమితి సభ్యుల నిర్వహణలో ప్రాతఃకాలమున ఆలయ అర్చక స్వాములు సాయిబాబా మూల విరాట్‌కు పురుష సూక్తంతో అభిషేకాన్ని నిర్వహించారు. వివిధ రకాల పూలతో సాయినాథునికి అష్టోత్తర పూజ చేశారు. రాత్రి ఏడు గంటలకు సుమనోహరంగా మహిళా భక్తులతో మందిర ప్రాంగణంలో కోలాటంతో నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో షిరిడీ సాయి కల్చరల్ మిషన్ సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ కార్యదర్శిగా వినోద్

ఒంగోలు టౌన్: భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శిగా సీహెచ్ వినోద్ ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక ఎల్బీజీ భవన్‌లో జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షునిగా కె.విజయ్, ఉపాధ్యక్షులుగా వీరాస్వామి, దేవరాజు, మధు, సహాయ కార్యదర్శులుగా లోకేష్, జీవన్, పాండురంగారావుతో పాటు 9 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, విద్యార్థులందరికీ ఉచితంగా బస్ పాసులు ఇవ్వాలని, అమ్మ ఒడి పథకాన్ని అర్హులందరికీ ఇవ్వాలని జిల్లా మహాసభల్లో తీర్మానాలు చేసినట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటా

- రెండు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



రాంబాబు మృతదేహానికి నివాళులర్పిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, బ్రాహ్మణ సమితి సభ్యులు



మేడిద శివకు నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ఇటీవల ఇద్దరు మరణించగా, వారి కుటుంబాలను ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం పరామర్శించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. స్థానిక సీఆర్‌పీ క్వార్టర్స్‌లోని డీపీఆర్ ప్రసాద్ ఇంటికి చేరుకుని అతని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రసాద్ ఎలా మరణించారని అడిగి తెలుసుకున్నారు. ప్రసాద్ రాష్ట్రస్థాయిలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే దళితుల సమస్యలపై పోరాటం చేయడం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన మరణం సమాజానికి తీరని లోటన్నారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా బాలినేని గుర్తుచేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

అనంతరం స్థానిక 13వ డివిజన్ కబాడీపాలెంలో ఇటీవల మరణించిన మేడిద శివ ఇంటికి చేరుకున్నారు. శివ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాను అండగా ఉంటానంటూ ధైర్యం చెప్పారు. బాలినేని వెంట వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్, 13వ డివిజన్ కార్పొరేటర్ కొప్పర్ల కమల, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, తదితరులు ఉన్నారు.

రాంబాబు మృతదేహానికి నివాళులు...

ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరం సభ్యుడు, సత్యపార్వతి కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మద్దులూరి రాంబాబు (78) మృతి చెందగా, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వారి నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు శేషయ్య, కార్యదర్శి రంగనాథ్, సహాయ కార్యదర్శి శాస్త్రి, సభ్యులు ఉన్నారు.

బాలినేని జన్మదినం సందర్భంగా కాశీలో అన్నదానం



కాశీలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దక్షిణామూర్తి

ఒంగోలు మెట్రో: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రఖ్యాత శైవక్షేత్రం, భూ కైలాసం అయిన వారణాసి క్షేత్రంలో నారాయణ సేవ నిర్వహించారు. ఒంగోలుకు చెందిన ప్రముఖ వేద పండితులు మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో కాశీ క్షేత్రంలోని శ్రీ రామతారక ఆంధ్రాశ్రమంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణామూర్తి మాట్లాడుతూ కాశీ క్షేత్రంలో నారాయణ సేవ (అన్నదానం) చేయడం ఎంతో పుణ్యమని అన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి ఎంతో మంది భక్తులు వ్యయప్రయాసలు పడి కాశీ విశ్వనాథుని దర్శనానికి వస్తుంటారని తెలిపారు. అటువంటి వారికి పూర్వం చక్రవర్తులు, రాజులు నిత్యం నారాయణసేవ చేసేవారని తెలిపారు. అటువంటి సేవా కార్యక్రమాన్ని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహించడం శుభ పరిణామం అని అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలతో భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. సేవలో పాల్గొన్న వారంతా ఎమ్మెల్యే బాలినేని కుటుంబసభ్యులకు మంగళా శాసనాలు అందించారని దక్షిణామూర్తి తెలిపారు.

బాలినేనికి సత్కారం



బాలినేనిని సత్కరిస్తున్న అరుణ, మేయర్ గంగాడ



బాలినేనిని సన్మానిస్తున్న ఇందిర, లీలాకుమారి

ఒంగోలు: స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా ఎంపికైన బైరెడ్డి అరుణ బుధవారం ఘనంగా సత్కరించారు. తనకు పదవి కేటాయించినందుకు బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, మహిళా నాయకురాళ్లు పల్లా అనూరాధ, బేతపూడి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జిగా ఎంపికైన బడుగు ఇందిర, సంయుక్త కార్యదర్శిగా ఎంపికైన లీలాకుమారి, తదితరులు బాలినేనిని కలిసి ఘనంగా సన్మానించారు.

జగనన్నకు మరోసారి మద్దతిద్దాం



మల్లవరంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అరుణ, అప్పారావు



కె.పల్లెపాలెంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ ఆనందరావు

- ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: రాబోయే ఎన్నికల్లో సీఎం జగనన్నకు మరోసారి మద్దతు తెలిపి ముఖ్యమంత్రిని చేసుకుందామని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని మల్లవరం గ్రామంలో బుధవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలుస్తూ ప్రభుత్వ పథకాలను పార్టీలకతీతంగా లబ్ధిదారులకు అందిస్తూ వారి అభ్యున్నతికి జగనన్న పాటుపడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరు చెప్పి వారు సిఫార్సు చేసిన వారికే ప్రభుత్వ పథకాలు అందించారని గుర్తుచేశారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదన్నారు. అర్హులైతే చాలు.. వారికి వలంటీర్ల ద్వారా పథకాలు అందిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పరిపాలనను గ్రామాల్లోకి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నదేనని అన్నారు. గతంలో నెలల తరబడి మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిని తొలగించారన్నారు. గ్రామస్తులంతా వచ్చే ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారులు, నగదు వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏట సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, పవన్, గ్రామ సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, గ్రామ నాయకులు కృష్ణారెడ్డి, చెంచిరెడ్డి, అంజిరెడ్డి, రావూరి నరసింహారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ రాజ్యం

ఒంగోలు టౌన్: దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వైఎస్సార్ సీపీ అర్బన్ మండల అధ్యక్షుడు రాయపాటి అంకయ్య అన్నారు. బుధవారం నగరంలోని కబాడిపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్, రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే.. అనే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపాటి అంకయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నూటికి నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందని చెప్పారు. అమ్మ ఒడి, చేయూత, భరోసా లాంటి పథకాలతో పాటుగా ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడే అనేక కార్యక్రమాలను సీఎం అమలు చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని 25 లక్షల రూపాయలకు పెంచారని, జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఇంటి వద్దనే ఆరోగ్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. విద్యా రంగం అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని, నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని తెలిపారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఒంగోలు నగరాభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చిన ప్రజానేత బాలినేని శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో జిల్లా అభివృద్ధి కోసం రానున్న ఎన్నికలలో పోరాడతామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పర్ల కమలమ్మ, గంగవరపు ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు రాజేష్, నాయకులు కె.సుధాకర్, రాజశేఖర్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తొర్రగుడిపాడు గ్రామంలో...

చీమకుర్తి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం తొర్రగుడిపాడు గ్రామంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామంలో ఇప్పటి వరకు రూ.15 కోట్ల విలువ కలిగిన పథకాలు అందించారన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, సర్పంచ్ యద్దనపూడి అంజమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన 10 కుటుంబాలు...

తొర్రగుడిపాడు గ్రామంలో టీడీపీ నుంచి 10 కుటుంబాలు బుధవారం ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కె.పల్లెపాలెంలో రూ.36.55 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు...

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): కె.పల్లెపాలెంలో రూ.36.55 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినవన్నీ చేశారని, అందువలనే ఆయన మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కె.పల్లెపాలెం గ్రామ సచివాలయంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అధ్యక్షత వహించగా, ముందుగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఏమైతే చెప్పారో.. అవన్నీ నెరవేర్చారని వివరించారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కృషితో ఇళ్ల పట్టాలు, రూ.400 కోట్లతో ఫిషింగ్ హార్బర్ మంజూరయ్యాయని కొనియాడారు. రూ.2.75 కోట్లతో కొత్తపట్నం నుంచి కె.పల్లెపాలెం బీచ్ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు వేసినట్లు చెప్పారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం మనం చూస్తున్నామన్నారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజలకు ఎన్నో రకాల సేవలు అందుతున్నాయన్నారు. విద్య, వైద్యంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల గురించి వివరించారు. రూ.36.55 కోట్లతో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డును సర్పంచ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆయా వివరాలను నోడల్ ఆఫీసర్ చదివి వినిపించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మణిదీప్, వీఆర్వో సురేష్, మాజీ ఎంపీటీసీ పెద్దసింగు వెంకట్రావు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఒంగోలు కబాడిపాలెంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



తొర్రగుడిపాడులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

పన్ను వసూళ్ల లక్ష్యాలు చేరుకోవాలి



బృందావన్‌నగర్ వార్డు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: నగరంలో మూడో త్రైమాసికానికి సంబంధించిన పన్నుల వసూళ్లలో లక్ష్యాలను చేరుకోవాలని నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బంది, అధికారులు, వార్డు సచివాలయాల సిబ్బందిని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. నగరంలోని 46వ డివిజన్ బృందావన్‌నగర్ వార్డు సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది అందరూ మూవ్‌మెంట్ రిజిస్టర్ వాడాలని ఆదేశించారు. రిజిస్టర్ వాడని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకరూపు దుస్తులు ధరించని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సి-1 రిజిస్టర్, స్పందన రిజిస్టర్లను కూడా కమిషనర్ పరిశీలించారు. పన్ను వసూళ్లపై సమీక్షించారు. మొండి బకాయిలున్న వారి ఇళ్లకు వెళ్లి నోటీసులిచ్చి వసూలు చేయాలన్నారు. చెల్లించని వారి కుళాయి కనెక్షన్లు తొలగించాలని ఆదేశించారు. క్లాప్ యూజర్ ఫీ కలెక్షన్స్ వేగంగా వసూలు చేయాలన్నారు. అనంతరం నగరంలో జరుగుతున్న బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. 19వ డివిజన్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మాణంలో ఉన్న బీటీ రోడ్డును పరిశీలించారు. నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని ఇతర ప్రాంతాల్లోనూ కమిషనర్ పర్యటించగా, డీఈ పద్మజ, ఏఈ అనిల్‌కుమార్, బృందావన్‌నగర్ వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవాభావమే క్రీస్తు మార్గం

- రిమ్స్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరరావు



డాక్టర్ రాజేశ్వరరావును సన్మానిస్తున్న సిబ్బంది

ఒంగోలు టౌన్: సేవాభావంతో పనిచేయడం, రోగుల పట్ల అంకితభావం కలిగి ఉండటమే క్రీస్తు మార్గమని రిమ్స్ హాస్పిటల్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరరావు అన్నారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా బుధవారం జీజీహెచ్‌లో నర్సింగ్ సిబ్బంది ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రిమ్స్ ఏర్పాటు అనంతరం సూపరింటెండెంట్‌గా తన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. పేదలకు సేవ చేయడం ద్వారా మరింత ఆత్మసంతృప్తి లభిస్తుందని సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ తిరుమలరావు అన్నారు. ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో జీవించాలని, పొరుగువారిని గౌరవించడం, కలిసి మెలిసి సంతోషంగా గడపటం దేవుడికి ఎంతో ఇష్టమైన కార్యాలని డిప్యూటీ సూపరింటెండెంట్ డా.ప్రభాకర్‌రావు చెప్పారు. ఏఆర్ఎంఓ డా.అనిల్, డా.జయశ్రీ, డా.అచ్చంనాయుడు, నర్సింగ్ సూపరింటెండెంట్ సంపూర్ణమ్మ, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ రాజేశ్వరరావును ఘనంగా సన్మానించారు.

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న సీతారాం

ఒంగోలు టౌన్: మిచాంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో జరిగిన జిల్లా ప్లీనం సమావేశంలో ఆయన ప్రసంగించారు. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ రావడం వల్ల రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. కరువు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, నాయకులు జీవీ కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రైతులను ఆదుకోవాలని వినతి

ఒంగోలు సెంట్రల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, బాపట్ల జిల్లా ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి, పార్లమెంటు కన్వీనర్ సిగ్గెం శ్రీనివాసరావు, అసెంబ్లీ కన్వీనర్ యోగయ్యయాదవ్, పొగాకు బోర్డు మెంబర్లు పాద వరప్రసాద్, బోడపాటి బ్రహ్మయ్య, తనికొండ సురేష్, కోటేశ్వరి, కృష్ణవేణి పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో ఆర్.శ్రీలతకు పలు వినతులతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.

రాష్ట్రంలో 35 స్థానాల నుంచి సీపీఐ పోటీ

ఒంగోలు టౌన్: ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 35 స్థానాల్లో సీపీఐ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య తెలిపారు. బుధవారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాల నుంచి సీపీఐ అభ్యర్థులు బరిలో నిలుస్తారన్నారు. అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు ఇప్పటి నుంచే పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభలో అడుగు పెట్టడమే తమ లక్ష్యమన్నారు. కమ్యూనిస్టులు లేని చట్టసభలలో ప్రజాసమస్యలు పరిష్కారం కావని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మైనంపాడు విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం, టీచర్లు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు ప్లస్‌కు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రవికుమార్ బుధవారం తెలిపారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్-19 విభాగానికి భవ్యశ్రీ, అనిత, కల్యాణి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14, 15, 16 తేదీల్లో అనకాపల్లిలోని నక్కపల్లి హైస్కూలులో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం, టీచర్లు, స్కూలు కమిటీ సభ్యులు అభినందించారు.